

ఎస్‌కెయులో 28 నుంచి అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్‌కెయు గణిత శాస్త్ర విభాగంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు "ఇన్నోవేషన్స్ అండ్ డెవలెప్‌మెంట్స్ ఇన్ మ్యాథమెటికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ" అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి రామకృష్ణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, యూపీఎస్సీ, మాజీ సభ్యులు వై.వెంకటరామిరెడ్డిలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటారన్నారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ తిరుపతికి చెందిన ఆచార్య డిఎస్.నాగరాజు ముఖ్య ఉపన్యాసకులుగా వస్తున్నారన్నారు. మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సులో వివిధ దేశాల నుంచి వక్తలు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. జర్మనీ, మలేషియా, ఫిజీ, అమెరికా దేశాల నుంచి వర్చువల్ విధానంలోనూ పాల్గొంటారన్నారు. వీరితోపాటు జాతీయస్థాయిలో వక్తలు హాజరవుతారని తెలిపారు.



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మాదక ద్రవ్యాలను తరిమేద్దాం

ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

సమాజానికి చెడును చేసే మాదక ద్రవ్యాలను తరిమేసేందుకు యువత ముందుకు రావాలని ఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్, సెబ్ ఆధ్వర్యంలో సోమవారం నాడు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి మొదలైన ర్యాలీ సప్తగిరి సర్కిల్, సుభాష్ రోడ్డు మీదుగా క్లాక్ టవర్ వరకు కొనసాగింది. క్లాక్ టవర్ సమీపంలో మానవ హారంగా ఏర్పడి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ ఎస్పీ యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్తును దష్టిలో ఉంచుకుని మాదక ద్రవ్యాలను పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. వీటిని వాడటం వల్ల ఉజ్వల భవిష్యత్తును చేజేతులారా నాశనం చేసుకున్న వారవుతారన్నారు. మాదక ద్రవ్యాలు విక్రయించేవారి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జి.రామకష్ణ, ఎ.హనుమంతు, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, సిఐలు శివరాముడు, కత్తి శ్రీనివాసులు, ప్రతాప్ రెడ్డి, వెంకటేష్ నాయక్, చిన్న గోవింద్, సెబ్ సిఐ నరసానాయుడు పాల్గొన్నారు.



తమ్ముళ్ల కొట్లాట..!

- భవిష్యత్తు కోసం ఆరాటం
- బస్సుయాత్రలో నేతల మధ్య ఆధిపత్య పోరు
- టిడిపిలో కొనసాగుతున్న గ్రూపు తగాదాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజల భవిష్యత్తుకు టిడిపి పేరుతో బస్సు యాత్ర చేపట్టిన తెలుగుదేశం పార్టీకి కొత్త తలనొప్పులు వచ్చిపడుతున్నాయి. ప్రజల్లోకి వెళ్లేందుకు చేపట్టిన ఈ యాత్ర గ్రూపు తగాదాలకు కేంద్రంగా మారుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నేతల భవిష్యత్తుకు ఆరాటంలాగా మారి ఆధిపత్యపు యాత్రగా సాగుతోంది. ఆ పార్టీ నేతల మధ్యనున్న విభేదాలు ప్రతి చోటా బయట పడుతూ వస్తున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఈ యాత్రను సైతం రద్దు చేసుకునే పరిస్థితి నెలకొంది. ఈనెల 23వ తేదీన కదిరిలో బస్సుయాత్ర అట్టహాసంగా ప్రారంభమైంది. అక్కడ మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషాకు పిలుపు లేకపోవడంతో ఆయన ఈ యాత్రకు దూరంగా ఉన్నారు. ఇక పుట్టపర్తిలో సాధారణంగానే జరిగినప్పటికీ పెనుకొండకు వచ్చే సరికి నేతల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయి. నేతలు గ్రూపులుగా విడిపోయి బాహాబాహికి దిగారు. సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులుగా బికె.పార్థసారధి, మరో నాయకురాలు సబితమ్మ మధ్య గ్రూపు విభేదాలున్నాయి. ఈ గ్రూపులకు నాయకుల ఫ్లెక్సీలుండటం కూడా తగాదాకు కారణమైంది. బస్సుయాత్ర సందర్భంగా ఒకరినొకరు బాహాటంగానే కొట్టుకున్నారు. జిల్లా అధ్యక్షుడి నియోజక వర్గంలోనే ఇది జరగడం గమనార్హం. ఇక కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మంగళవారం యాత్ర జరుగనున్న నేపథ్యంలో ఇప్పటికే ఉత్కంఠత నెలకొంది. అక్కడ ముందు నుంచి మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారుడు మారుతీ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర నాయుడు రెండు గ్రూపుల మధ్య విభేదాలున్నాయి. ఈ గ్రూపుల మధ్య అనేక మార్లు బాహాటంగానే ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం జరిగే బస్సు యాత్రలోనూ రెండు గ్రూపుల నాయకులు బల ప్రదర్శనలకు దిగి తమ పట్టును చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ బల ప్రదర్శనలో ఏమి జరుగుతుందన్న ఉత్కంఠత ఆ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. ఇటువంటి విభేదాలు మరికొన్ని నియోజకవర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. మడకశిరలోనూ మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిల మధ్య విభేదాలున్నాయి. ఈ క్రమంలో ఇక్కడ యాత్రనే లేకుండా చేశారు. ఇక హిందూపురంలోనూ యాత్ర లేదు. ఆ తరువాత అత్యధికంగా విభేదాలున్న ప్రాంతాల్లో శింగనమల కూడా ఉంది. ఇక్కడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి లేకుండా టూమెన్ కమిటీ పేరుతోనే నడుస్తోంది. ఈ టూమెన్, ఇన్‌ఛార్జి బండారు శ్రావణి గ్రూపుల మధ్య ఏమి జరుగుతందో నన్నది కార్యకర్తల్లో ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి తీరని నష్టం చేకూరింది. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీకి ఘోర పరాజయమైంది. ఇంత జరిగినా పార్టీ నేతల్లో కనువిప్పు కలుగలేదు. నాయకుల మధ్య సమన్వయం ఇప్పటికీ కుదరలేదు. ఎవరికీ వారుగా నేతలు ఆధిపత్యం కోసం ఆరాటపడుతూనే ఉన్నారు. నేతల మధ్య తగాదాల ప్రభావం క్షేత్ర స్థాయిలో కార్యకర్తలను, ద్వితీయ శ్రేణి నాయకులను సైతం గందరగోళంలో పడేస్తోంది. ఇదే పరిస్థితి వచ్చే ఎన్నికల్లోనూ కొనసాగితే అధికార వైసిపిని తట్టుకుని నిలబడటం ఎంత వరకు సాధ్యమవుతుందన్న మీమాంస పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఈ బస్సుయాత్ర ముందు కెళుతున్న కొద్ది మరిన్ని విభేదాలు పార్టీలో నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఇంటర్ విద్యార్థులకూ పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- నాయకుల అరెస్ట్, విడుదల



కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకూ ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను ఉచితంగా ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ఎదుట సోమవారం నాడు ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు కలెక్టరేట్ గేటు ఎదుట రోడ్డుపై బైటాయించి ధర్నా నిర్వహించారు. విద్యార్థుల సమస్యల పరిష్కరించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, ధర్నా వద్దకు వచ్చి విద్యార్థులతో మాట్లాడాలంటూ నాయకులు ఆందోళన నిర్వహించారు. అప్పటికే అక్కడున్న సిఐ రెడ్డప్ప నేతృత్వంలోని పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులను బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అంతకుముందు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పుస్తకాలు ఇస్తున్నామని ప్రభుత్వ చెబుతోందన్నారు. ఇంత వరకు పాఠ్యపుస్తకాలు అందలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేద మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. పాఠ్యపుస్తకాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం వాటిని ఇవ్వలేమని విద్యా శాఖ మంత్రి ప్రకటన చేయడం అన్యాయంగా ఉందన్నారు. బీసీ, ఎస్టీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు అనేక సమస్యల నడుమ విధ్యనభ్యసిస్తున్నారని తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పురాతన భవనాలు పెచ్చులు ఊడిపోతూ వర్షం నీరు కారడం వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అద్దె భవనంలో ఉన్న సంక్షేమ హాస్టళ్లలో సరైన మంచినీరు, మరుగుదొడ్లు లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి నాడు-నేడు పనులు ప్రారంభించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. వసతి, విద్యా దీవెన పథకం డబ్బులు ఇప్పటికీ విద్యార్థుల ఖాతాల్లోకి జమ కాలేదన్నారు. వెంటనే విద్యా దీవెన, వసతి దీవెన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకులం, కేజీబీవీ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలన్నారు. జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివ, రాష్ట్ర కమిటీ సభ్యులు వైటిసి.రమేష్, రజిత, జిల్లా నాయకులు తరిమెల గిరి, సిద్దు, సూర్యప్రకాష్, వరుణ్, వెంకీ, వర్ధన్, శివ, రాజేష్, రజిత, సూర్య, శశి విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ నాయకులు పరమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు అరెస్టు చేస్తున్న పోలీసులు



అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ఫిర్యాదుదారులతో నిండిన స్పందన గ్రీవెన్స్ భవనం(ఇన్‌సెట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి)

స్పందన వినతులకు సత్వర పరిష్కారం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్పందనలో స్వీకరించిన వినతులకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిష్కార మార్గాలు చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. శుక్రవారం నాడు కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆమె మాట్లాడారు. స్పందన ఫిర్యాదులపై ఆయా శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలు పాటించి పరిష్కారం చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం స్పందనలో వచ్చిన అర్జీలకు అర్జీదారుడు సంతప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో ఉన్న రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, తదితర శాఖలు, మున్సిపల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతప్తి చెందేలా వినతులను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. జిల్లా అధికారులు కూడా వ్యక్తిగత శ్రద్ధతోపాటు జవాబుదారీతో అర్జీల పరిష్కారంలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన తోడ్పాటు అందించాలని తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయం, పంచాయతీరాజ్ హౌసింగ్, ఎస్పీ బీసీఎల్ సర్వే అండ్ ల్యాండ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ మున్సిపాలిటీ పశుసంవర్ధక శాఖ లో అర్జీలు చాలా వరకు పెండింగ్ లో ఉన్నాయని వాటిని సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కేశవ నాయుడు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైరస్ సోకిన మిరప పంట తొలగింపు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురంతండాకు చెందిన రైతు హనుమంతు సాగు చేసిన మిరప పంటను వైరస్ సోకడంతో సోమవారం పంట తొలగించాడు. హనుమంతు తనకున్న ఒకటిన్నర ఎకరా పొలంలో రూ. 70 వేలు ఖర్చు చేసి మిరప పంటను సాగు చేశాడు. వైరస్ సోకడంతో పంట తొలగించినట్లు రైతు తెలిపాడు.

విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ ఛార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం నాడు అనంతపురం ఎన్జీవో హోంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన విద్యుత్ ఛార్జీలు పెంచి వందల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలను ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశానికి తనతో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు సి. పెద్దన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. వ్యాపార సంఘాలు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

జిల్లా గ్రంథాలయానికి నిఘంటువులు అందజేత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా కేంద్ర గ్రంథాలయానికి అనంతపురం ఎంపీ తలారి రంగయ్య ఆధ్వర్యంలో నిఘంటువులను అందజేశారు. మంగళవారం జిల్లా గ్రంథాలయంలో ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, కార్యదర్శి రమాలకు డిక్షనరీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, రాష్ట్ర నాయకులు మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, నాయకులు చామలూరు రాజగోపాల్, గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపాలిటీలో కరోనా సమయంలో ప్రాణాలను లెక్కచేయక తాత్కాలిక పద్ధతిన పారిశుధ్య కార్మికులు గా సేవలందించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మల్లికార్జున, జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో సిఐటియు ఆధ్వర్యంలో ఛైర్‌పర్సన్ పోరాలు శిల్ప, అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ పట్టణంలో కరోనా, గతేడాది భారీ వర్షాలు కురిసిన సమయంలో పారిశుధ్య కార్మికులు సేవలందించారన్నారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం పారిశుధ్య విభాగంలో పని భారం పెరిగినందున వారిని ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ప్రజాప్రతినిధులు వీరి విషయం పరిశీలిస్తామని తెలిపారు.


అక్రమ వసూళ్లను ఆపండి సారూ..

బొమ్మనహాల్ : కర్నాటకకు పంట దిగుబడులను తరలిస్తున్న లగేజీ వాహనాల నుంచి అక్రమ వసూళ్లు ఆపాలని ఆటో, బొలెరో, తదితర వాహనాలు నడుపుతూ జీవనం సాగించే డ్రైవర్లు పోలీసు ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటు న్నారు. మండల వ్యాప్తంగా రైతులు పత్తి, మిరప, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఆ పంట దిగుబడులను కర్నాటకలోని బళ్లారి మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఆటో, బొలెరో, తదితర వాహనాల్లో లోడ్ చేసుకుని బొమ్మనహాల్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. అయితే స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సెంట్రీ విధులు నిర్వహించే సిబ్బంది ఒక్కో వాహనం నుంచి రూ. వంద అక్రమంగా వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని వాహనాలపై ఏదో ఒక కేసు నమోదు చేస్తున్నారని డ్రైవర్లు వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పోలీసుల వేధింపులు, వసూళ్ల ఆపాలని వాహనదారులు కోరుతున్నారు.

ఖరీఫ్ 2022 పంటల బీమా ప్రకటించాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఖరీఫ్ 2022లో అతివృష్టి, అనావృష్టితో అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయారని, ఆ పంటలకు బీమా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ 2022లో అతివష్టి అనావష్టి వల్ల వేరుశనగ, పత్తి, మిరప, కంది, తదితర పంటలు పొలాల్లోనే కుళ్ళిపోయి మొలకలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోయారన్నారు. 2019లో 46 మంది, 2020లో 67 మంది, 2021లో 44 మంది, 2022లో 62 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. పంటల బీమా ద్వారా రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఖరీఫ్ సీజనకు ముందే ప్రకటించిందన్నారు. తక్షణమే బీమా ప్రకటించి రైతులకు సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకట చౌదరి, సూరి, పెదయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

తాగునీటి సమస్యపై టిడిపి నిరసన

కౌన్సిల్ సమావేశంలో ఖాళీ బిందెలతో ఆందోళన



కౌన్సిల్ సమావేశంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న టిడిపి సభ్యులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో పది రోజులుగా తాగునీటి సమస్య నెలకొన్నా పట్టించుకునేవారే లేరని సోమవారం మున్సిపల్ సమావేశంలో టిడిపి కౌన్సిలర్లు ప్రశాంతి, జ్యోతి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఛైర్‌పర్సన్ పోరాలు శిల్ప అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. నీటి సమస్యపై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి స్పందిస్తూ పైపులైన్ లీకేజీ మరమ్మతులు, కొత్త మోటార్లు అమరుస్తున్న నేపథ్యంలో పట్టణంలో 3 రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ముందుగానే ప్రజలకు తెలిపామన్నారు. అనంతరం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మరొక రోజు ఆలస్యమైందని, దీంతో ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నామన్నారు. అవసరాన్ని బట్టి అదనపు ట్యాంకర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కౌన్సిల్ హాలులోకి ఖాళీ బిందెలు తీసుకురావడం పట్ల కౌన్సిలర్ గోవిందరాజులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా పాల్గొన్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సభ్యులు కౌన్సిల్ సమావేశాల్లో లేవనెత్తిన సమస్యలు, ప్రశ్నలకు తదుపరి జరగబోయే కౌన్సిల్ సమావేశంలో అధికారులు సమాధానంతో సిద్ధంగా ఉండాలన్నారు. పట్టణ పరిధిలో త్వరలో 3 చోట్ల కొత్తగా మురికి కాలువలు, వంతెనల నిర్మాణం చేపడతామని, వివిధ అభివృద్ధి పనులకు రూ. వంద కోట్లు మంజూరవుతున్నట్లు తెలిపారు. అనంతరం అజెండాలోని అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి : విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సూచించారు. పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో సోమవారం ఆయన విలేకరు ల సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు 11 రకాల సేవలను ఉచితంగా పొందవచ్చు అన్నారు. అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలన్నదే సీఎం జగన్ ఉద్దేశం అన్నారు. ప్రతిపక్ష నేత కాలవ శ్రీనివాసులు వారి పార్టీకి చెందిన అర్హులను పంపవచ్చు అన్నారు. తాము 98% వాగ్దానాలను నెరవేర్చామన్నారు. టిడిపి హయాంలో జన్మభూమి కమిటీల పేరిట ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులకు మాత్రమే లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు ఉండేవన్నారు. బస్సు యాత్ర టిడిపికి అంతిమ యాత్ర అన్నారు. ఆయనతో పాటు వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ ముస్తాక్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ పాలకమండలి సభ్యుడు ఐ.శ్రీనివాసులు, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

2022 పంటలకు బీమా ప్రకటించాలి

ఎపి రైతుసంఘం నాయకులు



తాడిపత్రి రూరల్‌లో తహశీల్దార్ మునివేలుకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

2022 ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు అధికంగా పడి దెబ్బతిన్న పంటలకు బీమా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టి వల్ల అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఈనేపథ్యంలో అనేకమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులకు కనీసం బీమా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం రైతుల నుంచి తీసుకునే భూములకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇళ్లు కోల్పోయిన వారికి మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు. అనంతరం తహశీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి, జయశేఖర్‌రెడ్డి, రమేష్, శిరీషా, రైతులు వెంకటేష్, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : సమస్త సృష్టిని పోషించే రైతులను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా కార్యవర్గదర్శి వర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు అన్నారు. ఈమేరకు సోమవారం స్థానిక ఆర్‌బికె అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2021-22, 22-23 సంవత్సరాలకు సంబంధించిన పంట నష్ట పరిహారాన్ని తక్షణమే చెల్లించాలన్నారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు అవసరమయ్యే మందులు, ఎరువులను 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. 2021 -22 సంవత్సరాల సంబంధించిన సస్పెన్షన్ అకౌంటు డబ్బులు సంబంధిత రైతులకు తక్షణమే అందించాలన్నారు. హార్టికల్చర్ ద్వారా నష్టపోయిన రైతులకు 90 శాతం పెట్టుబడి రాయితీ అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలన్నారు. అదేవిధంగా పిల్ల కాలువల ద్వారా సాగునీటి ప్రక్రియ జరిగే విధంగా ప్రభుత్వమే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాకే నాగరాజు, చరణ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఖరీఫ్-22 పంటల బీమాను వెంటనే ప్రకటించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఖరీఫ్-2022లో అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కావున వెంటనే రైతులకు పంటల బీమా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని, 90 శాతం సబ్సిడీతో డ్రిప్పులు, స్ప్రింక్లర్లు ఇవ్వాలని, పెండింగ్‌లో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, కరివేపాకు రైతులకు బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శివశంకర్, డివిజన్ సభ్యులు చౌడప్ప, రైతులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : గత సంవత్సరం ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు పంటల బీమా ప్రకటించాలని సిపిఎం ఆధ్వర్యంలో రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి వ్యవసాయ అధికారి కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ధర్నాలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ 2022 పంటల బీమాను వెంటనే ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతులక అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో రాముడు, యల్లప్ప, లక్ష్మీనారాయణ, నాగమ్మ, రైతులు పాల్గొన్నారు.

శింగనమల : 2022 ఖరీఫ్, రబీల్లో సాగు చేసి పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పంట నష్టపరిహారం మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ 2002లో అతివృష్టి, అనావృష్టి వల్ల అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. దీంతో అప్పులపాలై చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, సూరి, లక్ష్మీనారాయణరెడ్డి, సుంకన్న, రామాంజనేయులు, గంపమల్లయ్య, శంకర, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని రైతుసంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలో రైతుసంఘం ఆధ్వర్యంలో మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది పంటలు నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, వివిధ ప్రాజెక్టులకు సేకరిస్తున్న భూములకు 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికే మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పండ్ల తోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.కుళ్లాయప్ప, రైతుసంఘం మండల సెక్రటరీ డి.శ్రీనివాసులు, నాగరాజు, రాముడు, రామకృష్ణ, జగన్నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మద్యానికి డబ్బు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్ : అతిగా మద్యానికి బానిసై మద్యం కోసం కట్టుకున్న భార్య డబ్బులివ్వలేదన్న క్షణికావేశంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండలంలోని ఆలూరు గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పెద్దయ్య (37) ఆటో నడుపుతూ భార్య వరలక్ష్మి, తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగించేవాడు. భార్య సమీపంలోని సజ్జలదిన్నె గ్రామంలో సిమెంట్ పెళ్లలు పరిశ్రమలో కూలీగా పని చేసేది. ఈనేపత్యంలో అతిగా తాగుడుకు బానిసైన పెద్దయ్య ఆటో నడపగా వచ్చిన డబ్బులను పూర్తిగా మద్యానికి ఖర్చు చేయడమేకాకుండా, తన భార్య సంపాదించే సంపాదనను సైతం లాక్కెల్లి మద్యానికి ఖర్చు చేస్తూ, భార్యాపిల్లలను పట్టించుకునేవాడు కాదు. ఇంటిలో పిల్లలు, ఇతరత్రా ఖర్చుల కోసం భార్య వరలక్ష్మి దాచుకునే డబ్బులను కూడా వెదికి ఎత్తుకుపోయి మద్యానికి ఖర్చు చేసేవాడు. సోమవారం ఎక్కువగా మద్యం తాగి ఇంటికి వచ్చిన పెద్దయ్య ఇంట్లో అన్ని చోట్లా డబ్బుల కోసం వెతికాడు. కనీసం ఇంటిలో ఎక్కడా భార్య దాచి ఉంచిందనుకున్న డబ్బులు కనిపించలేదు. దీంతో చిరాకుతో పాటు మద్యం మత్తులో ఉన్న పెద్దయ్య ఇంటిలోని వస్తువులను చిందరవందర చేశాడు. బీరువాను పగులగొట్టాడు. చివరకు డబ్బుల కోసం భార్య వరలక్ష్మికి ఫోన్ చేశాడు. నాకు మద్యం తాగేందుకు డబ్బులు కావాలని, వెంటనే పని వద్ద నుండి ఇంటికి రావాలని బెదిరించాడు. దీంతో తన వద్ద డబ్బులు లేవని, మద్యం అలవాటు ఇప్పటికైనా మానుకోవాలని, వరలక్ష్మి తన భర్త పెద్దయ్యకు గట్టిగా చెప్పింది. దీంతో మద్యానికి డబ్బులు ఇవ్వనన్నందుకు ఇంటిలో గడియపెట్టి, చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పని నుండి ఇంటికి తిరిగి వచ్చిన మతుడి భార్య వరలక్ష్మి తలుపు లోపల గడియపెట్టి ఉండడాన్ని చూసి, చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా పెద్దయ్య ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో రూరల్ పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి 6 సంవత్సరాల కుమారుడు, 8 సంవత్సరాల కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని గోళ్ల-పాతచెరువు గ్రామాల మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసింహులు(47) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని చాపిరి గ్రామానికి చెందిన నరసింహులు తన సోదరిని గోళ్ల గ్రామంలో వదిలేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వెళ్తుండగా అనంతపురం వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్కా బీటర్లు అరెస్టు

తాడిపత్రి రూరల్ : మండలవ్యాప్తంగా పలుప్రాంతాల్లో పేదలను ఆసరాగా చేసుకుని, మట్కాలో సులభంగా డబ్బును సంపాదించవచ్చని నమ్మబలుకుతూ, మట్కాను రాస్తున్న 16 మంది బీటర్లను సోమవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ సీఎం గంగయ్య తెలిపారు. సోమవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్పీ కే.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తన పర్యవేక్షణలో మట్కా బీటర్లపై నిఘా ఉంచి మండల పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీతోపాటు ఊరుచింతల గ్రామంలోని పెద్దమ్మ గుడి వద్ద మట్కా నిర్వహిస్తున్న బీటర్లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. యడం జరిగిందని ఆయన వివరించారు. నంద్యాల జిల్లా, కొలిమిగుండ్ల మండలం, అంకిరెడ్డిపల్లికి చెందిన నేతిప్రసాద్, సైజు గాళ్ల వెంకట రాముడు, తాడిపత్రి మండలంలోని బుగ్గ, భోగసముద్రానికి చెందిన కటకం లక్ష్మయ్య, జమ్ములపాడు కిట్ట, కొట్టే లక్ష్మిరెడ్డిలు, సజ్జలదిన్నె గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ భాష, యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన తలారి నరసింహులు, పట్టణంలోని అంబేద్కర్ నగర్కు చెందిన దూదేకుల వన్నూరమ్మ, పెద్దపొలమడ గ్రామానికి చెందిన మంగళి సూర్యనారాయణ, అక్కన్నపల్లి గ్రామానికి చెందిన చిన్నబాలయ్య, రామన్నగారి నాగరాజులు, గన్నెవారిపల్లి కాలనీకి చెందిన తలారి బయన్న, దాస్తి సరస్వతి, పట్టణంలోని సుంకులమ్మ పాలెంకు చెందిన గొల్ల విశ్వనాథ్, వైఎస్ఆర్ జిల్లా, ఆర్ఎస్ కొండాపురం మండలం, యర్రగుడి గ్రామానికి చెందిన అబ్రహంను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.5,04,270 నగదు, మట్కా పట్టీలు, బాల్ పెన్నులు, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి, ఎస్ఐ మహమ్మద్ గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల ప్రయివేటీకరణ వద్దు

ఎపి రైతుసంఘం డిమాండ్

ప్రజాశక్తి-బెలుగుప్ప

రైతు భరోసా కేంద్రాలను వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో విలీనం చేయడాన్ని అపాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పిహెచ్ రాయుడు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విలీనం ఆపడంతోపాటు జీవో 36 ప్రకారం పెరిగిన వేతనాలు 2019 నుంచి అమలు చేయాలని, జగన్ ప్రభుత్వం సహకార రంగంలో 50శాతం షేర్లు ప్రయివేటు యాజమాన్యాలకి ఇవ్వాలని చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని, సహకార రంగాల ఉద్యోగుల గ్రాడ్యుటీ పది లక్షలకు పెంచాలన్నారు. సహకార పరపతి సంఘాలను ఇన్‌కమ్ టాక్స్ నుండి మినహాయించాలన్నారు. అలాగే రైతులకు రుణాలు అందించడంలో, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పంటల సేకరణలో సహకార రంగ ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. జగన్ ప్రభుత్వం సహకార రంగాన్ని ప్రయివేటీకరణ చేయడం ద్వారా రైతాంగానికి, సహకార రంగ ఉద్యోగులకు తీవ్ర నష్టం చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో రైతుల రుణమాఫీ చేసే అవకాశం లేకుండా ప్రయివేటీకరణ చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సహకార రంగాన్ని నిర్వీర్యం చేసే చట్టాలు చేస్తుంటే రాష్ట్రంలో వైసిపి, టిడిపి ఎంపిలు మద్దతు తెలపడం రాష్ట్ర రైతాంగం చేసుకున్న దౌర్భాగ్యమన్నారు. బిజెపి విధానాలకు రాష్ట్రంలో మద్దతు తెలిపేవారిని ఓడించి సహకార రంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రజలపై విద్యుత్ భారాలు మోపొద్దు..

వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలను మోపరాదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామకష్ణ, సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ కార్యాలయం వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యుల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ బిల్లులతోనే షాక్ తగులుతోందన్నారు. దొడ్డిదారిన సర్దుబాటు ఛార్జీలు వేస్తూ రాబోయే రోజుల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి కార్పొరేట్ సంస్థలకు నిర్వహణ అప్పగించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. సామాన్యుల నుంచి దోచిన సొమ్మును ప్రభుత్వాలు అదానీ, అంబానీలకు అప్పగిస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఐద్వా మండల అధ్యక్షురాలు కవిత, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు మద్దిలేటి, సిపిఐ నాయకులు, రాజు, వెంకటరాముడు, నరసింహా, వెంకటేష్, రఫీ, అశోక్, మహిళా సంఘం మండల కార్యదర్శి మహమ్మదా తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై పెంచిన విద్యుత్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధతం చేస్తామని ప్రతిపక్ష పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈమేరకు సోమవారం సిపిఎం, సిపిఐ, టిడిపి ఆధ్వర్యంలో విద్యుత్తు ఛార్జీల భారాన్ని నిరసిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.శ్రీనివాసులు, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో 8సార్లు ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపిందన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాకే నాగరాజు, మారుతీప్రసాద్, తిమ్మప్ప, రామునాయక్, సిపిఐ జిల్లా నాయకులు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, టిడిపి నాయకులు టి.కేశప్ప, మస్తాన్‌యాదవ్, ప్రతాప్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్... నోరు అదుపులో ఉంచుకోండి..!

ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

ప్రజాశక్తి-ఉరవకొండ

టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వైసిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హెచ్చరించారు. సోమవారం వజ్రకరూరు మండలం గంజికుంటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయన్నారు. చంద్రబాబు ఒక్కడే జగన్‌ను ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక పవన్‌కళ్యాణ్‌ను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. వారాహి యాత్రలో పవన్ వ్యవహార శైలి పిచ్చి పట్టినట్లుగా ఉందన్నారు. పవన్ ఇదేవిధంగా వ్యవహరిస్తూ పోతే యాత్ర ముగిసేలోగా మెంటల్ ఆసుపత్రిలో చేరక తప్పదని జోస్యం చెప్పారు. ఇక నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర రాష్ట్ర చరిత్రలో ఒక కామెడీ యాత్రగా మిగిలిపోక తప్పదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో మెరుగైన సేవలు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, వాలంటీర్లు, నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించనున్నట్లు రుద్రంపేట సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణనాయక్, అధికారులు ఎఇ శ్రీనివాసరెడ్డి, డిటి రాజా, ఇన్‌ఛార్జి ఇఒఆర్‌డి నరసింహారెడ్డి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై సోమవారం రుద్రంపేట సచివాలయంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వాలంటర్లీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష పథకం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మహబూబ్‌బీ, వార్డు సభ్యురాలు పద్మావతి, సచివాలయ కన్వీనర్లు ఆక్కులప్ప, ముత్యాలు, రమాదేవి, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వాలంటర్లీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే అనంతపురం రూరల్ మండలం కందుకూరు -2 సచివాలయం పరిధిలో సర్పంచ్ బి.ప్రశాంత్‌కుమార్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుజ్జల వరలక్ష్మి, ఎంపిడిఒ వై.పుల్లయ్య, ఉపాధ్యక్షులు చియ్యేడు కృష్ణారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి వెంకటస్వామి, మండల జాయింట్ కన్వీనర్ పెరవలి జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

' ఈ బ్యాంకు మేనేజర్ మాకొద్దు'...!



రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు మేనేజర్ మాకొద్దంటూ మండల రైతులు సోమవారం స్థానిక అనంతపురం-బళ్లారి 44వ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వైస్ ఎంపిపి మోదపల్లి సునీతా రాణి రామాంజనేయులు, కొట్టాలపల్లి సర్పంచి లెజెండ్ మోదుపల్లి రామాంజనేయులు ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్ దురుసు ప్రవర్తనకు వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు క్రాఫ్‌లోన్ చేసే విషయంలో కాలయాపన చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రైతుతో బలవంతంగా ఒక్కొక్కరితో రూ.20 నుంచి రూ.30 వేల వరకూ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తేనే లోన్లు మంజూరు చేస్తామని, లేకుంటే చేయమని హుకుం జారీ చేస్తున్నారన్నారు. అలాగే గోల్డ్‌లోన్ల కోసం వచ్చే రైతులు, ప్రజలతో కూడా ఇదే ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే బ్యాంకు మేనేజర్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బ్యాంకుకు వచ్చే రైతులు, వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్న మేనేజర్‌పై విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మోదపల్లి బాబు, లక్ష్మీనారాయణ, కోటేశ్వర, కమలాకర్, ఎంపీ.సీనప్ప, నరప్ప, పెద్దకొట్టాలపల్లి, మాలాపురం, విడపనకల్, కరకముక్కల, కొత్తకోట, వేల్పుమడుగు తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పోతుల సునీత


వైసిపి అందరి ప్రభుత్వం

ఎమ్మెల్సీ పోతుల సునీత

అనంతపురం : రాష్ట్రంలో సిఎం జగన్ నేతృత్వంలో అక్కచెల్లెమ్మల ప్రభుత్వం సాగుతోందని ఎమ్మెల్సీ పోతుల సునీత తెలిపారు. సోమవారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్ సిఎం అయ్యాక రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ముఖ్యంగా పాదయాత్ర సమయంలో పేదల సమస్యలు తెలుసుకుని అన్నీ పరిష్కరించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ది కామెడీ గళం అని కొనియాడారు. ఆరోగ్యం కోసం చేసే వాకింగ్‌లా పాదయాత్ర ఉంది తప్ప ప్రజా సమస్యలు తెలుసుకునే లేదన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు పోతుల సురేష్, మహిళా నాయకురాళు ,, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకూ'

ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవిఆర్

ప్రజాశక్తి-గుత్తి

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తపేట, ఎంగిలబండ గ్రామాల్లో వైస్ ఎంపిపి ఎస్.తిరుపాలమ్మ, సర్పంచి ఆర్.గురుమస్తాన్, వైసిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎస్.రాముయాదవ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసమే సీఎం జగన్ నవరత్నాలు ప్రవేశపెట్టారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి జగనన్న పాటుపడుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మరోసారి వైయస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, ఎంపిపి జి.విశాలాక్షి, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, మార్కెట్‌యార్డు ఛైర్‌పర్సన్ సునాలాయాదవ్, కో ఆప్షన్‌సభ్యుడు మైనుద్దీన్, తహశీల్దార్ మహబూబ్‌బాషా, ఇఒఆర్‌డి శివాజీ రెడ్డి, ట్రాన్స్ కో, ఆర్‌డబ్ల్యుఎస్, పిఆర్ ఎఇలు శ్రీకుమార్, మంజునాథ్, మహేష్ నాయక్, వైసిపి సీనియర్ నాయకులు బి. శ్రీనివాస రెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కూడేరు రైతుభరోసా కేంద్రం తనిఖీ

అనంతపురం : కూడేరు మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రాన్ని సివిల్ సివిల్ సప్లయ్ కమిషనర్ అరుణ్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రైతు భరోసా కేంద్రంలో రైతులకు అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అనంతపురం వ్యవసాయ డివిజినల్ ఎడిఎ మీనల రవి, ఇన్‌ఛార్జి మండల వ్యవసాయ అధికారి విజయకుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అత్యాచార బాలికకు న్యాయం చేయాలి

ఉరవకొండ : పట్టణంలోని అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో అత్యాచారం జరిగిన బాలికకు న్యాయం జరిగేంత వరకూ పోరాడుతామని ఎంఆర్‌పిఎస్, టిడిపి, బీఎస్పీ నాయకులు స్పష్టం చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ముందు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికను లైంగిక వేధింపులకు గురి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఆ సమయంలో ఎవరైతే విధులు నిర్వహిస్తున్నారో ప్రిన్సిపాల్‌తో పాటు బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శేఖర్, ఎస్ఐ వెంకటస్వామి ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన విరివింపజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, మండల అధ్యక్షులు మోపిడి గోవిందు, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు ప్రభాకర్, రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప మాదిగ, జిల్లా అధ్యక్షులు రాజు, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల రవి, తాలూకా అధ్యక్షులు రాంపురం చెన్నప్ప, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రాయంపల్లి వెంకటేశులు, ఉరవకొండ తాలూకా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల సురేష్, నియోజకవర్గ అధ్యక్షులు రామాంజనేయులు మాదిగ, మల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అనంతపురం కలెక్టరేట్ : కార్పొరేషన్ పరిధిలో ట్రాఫిక్ పోలీస్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ట్రాఫిక్ సిఐ వెంకటేష్‌నాయక్ సూచించారు. సోమవారం నగరంలోని ప్రధాన కోడళ్లలో నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. రోడ్లలో వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ క్లియర్ అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వాటికి తోడు తోపుడు బండ్లు, కూరగాయల వాహనాలు, రోడ్లపైనే ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలన్నారు.

నేడు 'అనంత'లో నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థ పరిధిలోని లక్ష్మీనగర్ ట్యాంకు వద్ద పైప్‌లైన్ మర్మతులు చేయనున్న దృష్ట్యా మంగళవారం సాయంత్రం వరకూ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని సూపరింటెండెంట్ ఇంజినీర్ సతీష్‌చంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమణించి సహకరించాలని కోరారు.

బక్రీద్ పండుగకు ఏర్పాట్లు పూర్తి : మేయర్

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని ఈద్గా మైదానంలో బక్రీదు పండుగకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. ఈమేరకు ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహమ్మద్, వైసిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్‌తో కలిసి సోమవారం నగరంలోని హౌసింగ్‌బోర్డు ఈద్గా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వారంరోజులుగా ఈద్గాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈద్గా మైదానంలో పారిశుధ్య నిర్వహణ, నీటి సౌకర్యం, నమాజ్‌కు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, బాబాఫకృద్దీన్, కో అప్షన్ సభ్యులు శంషుద్దీన్, వక్ఫ్‌బోర్డు ఇఒ మహమ్మద్ హుస్సేన్, ఎంహెచ్ఒ గంగాధర, తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని ఆటోనగర్ కార్మికుల ధర్నా

తాడిపత్రి రూరల్ : 2005లో వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తాడిపత్రి ఆటోనగర్ కార్మికులకు కేటాయించిన స్థలాన్ని తమకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ ప్రభుత్వ హయాంలో 1200 మంది ఆటోనగర్ కార్మికులకు రెండు సెంట్ల చొప్పున ఇంటి పట్టాలిచ్చారన్నారు. అయితే అక్కడ మౌలిక వసతులు లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేకపోయామన్నారు. ప్రస్తుతం ఆ పట్టాలను రద్దు చేసి వేరొకరికి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి తమ స్థలాలను తమకే కేటాయించాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు ఎపి రైతుసంఘం, సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సంఘం నాయకులు రాజారామ్‌రెడ్డి, సిపిఐ నాయకులు రంగయ్య, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన



మాట్లాడుతున్న సిఐ శంకర్‌రెడ్డి

పెద్దవడుగూరు : రోడ్డు ప్రమాదాలపై మండలంలోని ప్రయివేటు పాఠశాలలకు చెందిన బస్సు డ్రైవర్లు, యజమానులకు సీఐ శంకరరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థులను వదిలిపెట్టే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్‌లు, ఇతరులతో మాట్లాడకూడదన్నారు. నిబంధలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఎఎస్ఐలు నారాయణనాయక్, మధుసూదన, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదాలపై సోమవారం మండలంలోని కళ్యాణదుర్గం-అనంతపురం జాతీయ రహదారిపై ఎస్ఐ జనార్ధన సోమవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ధరించకపోవడం, సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. వాహనదారులు మద్యం తాగి డ్రైవింగ్ చేసినా, అతివేగంతో వెళ్లినా, వాహనం నడుపుతూ ఫోన్‌లో మాట్లాడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఎఎస్ఐ కె.జనార్ధన, జమేదారు దేవేంద్రబాబునాయక్, కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని వినతి



డిప్యూటీ తహశీల్దార్ లలితకు వినతిపత్రం సమర్పిస్తున్న బి.హేమలత, కుటుంబ సభ్యులు

గుత్తి : తమ భూమికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని డిప్యూటీ తహశీల్దార్ లలితకు నేమితాబాదుకు చెందిన బి.హేమలత, కుటుంబ సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ మండలంలోని నేమితాబాదు గ్రామ సమీపంలో తమ తల్లి మాల కేశమ్మ పేరు మీద అధికారులు 2.49 ఎకరాల భూమికి సంబంధించి అధికారులు డి పట్టా ఇచ్చారన్నారు. సర్వే నంబర్ 222-ఇలో 1.77, సర్వే నంబర్ 97-ఇలో 0.72 ఎకరాల భూమి ఉందన్నారు. గతంలో సాగు చేసుకునే వారమని, అయితే చెరువు కట్ట తెగి తమ ఊరికి నీటితో ముప్పు వాటిల్లడంతో తమ ఇండ్లలోని సామాన్లు కొట్టుకుపోయాయన్నారు. దీంతో అప్పట్లో ఊరు వదిలి ఇతర ప్రాంతాల్లో కూలి పని చేసుకుని జీవనం కొనసాగించేవారమన్నారు. వన్ బి (479-479), అడంగుల్లో తమ పేర్లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం తమ స్వగ్రామానికి చేరుకున్నామని తమకు సంబంధించిన భూమికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరారు.

జగనన్న సురక్షపై వాలంటీర్లకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ యోగానంద

పుట్లూరు : జగనన్న సురక్షపై సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానంద అధ్యక్షతన సోమవారం వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ ఎంపిడిఒ మాట్లాడుతూ జగనన్న సురక్ష క్యాంప్ తేదీకి 7 రోజుల ముందు నుంచి వాలంటీర్లు సర్వే ప్రారంభించాలన్నారు. ముందుగా కడవకల్లు సచివాలయం పరిధిలో మంగళవారం, దోసలేడు సచివాలయం పరిధిలో గురువారం సర్వే ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మోహన్‌కుమార్, ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, కడవకల్లు, దోసలేడు, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రింటర్ వితరణ

పుట్లూరు : మండలంలోని గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు కలిసి సోమవారం ప్రింటర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ యోగానందరెడ్డి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, ఎఒ శ్రీధర్, టైపిస్ట్ శశికుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల ఆడిట్‌పై గ్రామసభలు

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల, కందికాపుల, గరుగుచింతలపల్లి పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చెన్నకేశవులు. ఇన్‌ఛార్జి ఇసి విజయ్‌నాగేందర్‌రెడ్డి, టిఎలు, డిఆర్పీలు, ఎఫ్‌ఎలు, గ్రామస్తులు, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

భూమి లేని పేదలకు సాగుభూమి ఇవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

పెద్దవడుగూరు : మండలంలో భూమిలేని నిరుపేదలకు సాగుభూమి ఇవ్వాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమార్కులు ఆక్రమించిన భూములను వెనక్కి ఇవ్వడంతోపాటు ఎస్సీలకు చెందిన భూముల్లో పండ్ల మొక్కలను ఉచితంగా అందించి బోర్లు వేసి, విద్యుత్తు సౌకర్యం కల్పించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లురాని వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాని డిమాండ్ చేశారు. భూమిలేని ప్రతి దళిత కుటుంబానికీ మూడెకరాల చొప్పున భూములివ్వాలన్నారు. అనంతరం ఉప తహశీల్దారు వెంకటేశ్వరమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు కత్తుల కొండయ్య, నాయకులు ఈరన్న, మారెన్న, రంగప్ప, సిపాయి, కంబగిరి నరేంద్ర, మసూద్, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలపై రైతులకు అవగాహన



పోస్టర్లను విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం : పండ్ల తోటలపై మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో డాక్టర్ మల్లేశ్వరి అధ్యక్షత సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ నేషనల్ హార్టికల్చర్ బోర్డు ఏకే శర్మ జిల్లా రైతులకు నేషనల్ హార్టికల్చర్ బోర్డు అందించే సబ్సిడీలను వివరించారు. దాదాపుగా 40 శాతం సబ్సిడీతో చీనీ, నిమ్మ, దానిమ్మ, ద్రాక్ష, జామ, మామిడి, బొప్పాయి, సపోటా, కొబ్బరి, చింత మొక్కలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేకులకుంట ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టర్ దీప్తి, డాక్టర్ విమల, కృషీ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సుధారాణి, డాక్టర్ కిషోర్‌రెడ్డి, డాక్టర్ మాధవి, డాక్టర్ శశికళ, శ్రీ చందన, అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు సభ్యుడు ఆలమూరు సుబ్బారెడ్డి, ఆదర్శ రైతు శివపురం విజయభాస్కర్‌రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్లు బేగం, పల్లవి, ధనుంజయ, రత్నకుమార్ అనంతపురం, సత్యసాయి జిల్లాల 80 మంది రైతులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

శింగనమల : అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న సిఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని వైసిపి సీనియర్ నాయకులు ముచ్చుకోట శ్రీకాంత్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సుపరిపాలన అందిస్తున్న ఏకైక సిఎం జగన్ అన్నారు. జగనన్న మూడున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వారి ఇంటికే వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. పథకాలన్నీ అందుతున్నాయా.. లేదా అని తెలుసుకునేందుకే ఇంటింటికీ వెళ్లి స్వయానా ఎమ్మెల్యేలు, నాయకులే తెలుసుకుంటున్నారన్నారు. గత టిడిపి హయాంలో అర్హులకు పథకాలను ఎలా కత్తిరించాలని ఆలోచించగా నేడు సిఎం జగన్ అర్హులకు ఎలా పథకాలు అందజేయాలని ఆలోచిస్తున్నారన్నారు. ఇలాంటి పారదర్శక పాలన అందిస్తున్న సిఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ

యాడికి : మండలంలోని రాయలచెరువు హైస్కూల్ సమీపంలో వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెన్నపూస వెంకటరామిరెడ్డి, సర్పంచి తలారి అరుణ, భర్త తలారి నగేష్, బ్రహ్మానందరెడ్డి, హనుమంతరెడ్డి, బాల చైతన్య, బాల రమేష్, జూటూరు భాస్కర్‌రెడ్డి, ఆకుల శివప్రసాద్, రసీదు, ఉపేంద్ర గౌడ్, ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న సిఐ నాగార్జునరెడ్డి

బుక్కరాయసముద్రం : మండల పోలీస్‌స్టేషన్‌లో 21 మంది రౌడీ షీటర్లకు సీఐ నాగార్జున రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు కౌన్సిలింగ్ నిర్వహించి డిప్యూటీ తాసిల్దార్ దగ్గర బైండోర్ చేయటం జరిగింది. గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో చట్టపరమైన వ్యతిరేక కార్యకలాపాలు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా చేసిన వారిపై పీడి యాక్ట్ నమోదు చేసి జరిమానంతో పాటు మండల బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ : వజ్రకరూరు మండల కేంద్రంలోని మొదటి వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో సీసీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మొనలిసా, ఎంపిపి రామవత్‌దేవి, వైస్ ఎంపిపి సుశీలారాణి, నాయకులు ప్రసాద్‌రెడ్డి, వెంకటరెడ్డి, వసికేరి రమేష్, ఉస్మాన్, నల్లబోతుల రాజు, వార్డు సభ్యురాలు అరుణమ్మ, ప్రభుదాస్, రఘుపతి, కిరణ్, వెంకటేసులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వీరబ్బాయి

ప్రజాశక్తి-అనంతపురం

యువత, విద్యార్థులతోపాటు ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వీరబ్బాయి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించారు. నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలుగు తల్లి విగ్రహం, జడ్పీ కార్యాలయం మీదుగా సాగి తిరిగి డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం వల్ల అనేక రకాల మానసిక, శారీరక రుగ్మతలకు లోనయ్యే అవకాశం ఉందన్నారు. యువత, ముఖ్యంగా విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలన్నారు. గంజాయిలో ఉండే టెట్రా హైడ్రోకెనబినాయిడ్ రసాయనం మెదడుపై తీవ్ర ప్రభావం చూపటం వల్ల శ్రద్ధ, ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని కోల్పోయే అవకాశం ఉందన్నారు. అంతేగాకుండా గంజాయి, ఇతర మత్తు ప్రభావానికి లోనైన వ్యక్తుల్లో చిత్తభ్రమలు కలగటం వల్ల లేనివి ఉన్నట్లు, ఉన్నవి లేనట్లు భ్రమించటం జరుగుతుందన్నారు. ఫలితంగా ప్రమాదాలు జరగటం, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు కలగటం వంటి దుష్పరిణామాలకు లోనయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి నియంత్రణాధికారి మనోజ్ మాట్లాడుతూ దేశీయంగా ప్రతి ఆరుగురిలో ఒకరు మద్యానికి బానిస అవుతున్నారన్నారు. 26 శాతం మంది ఏదో ఒక మత్తు పదార్థం తీసుకోనిదే దైనందిన చర్యలు చేయలేకపోతున్నారని సర్వేలు చెబుతున్నాయన్నారు. ముఖ్యంగా ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లతో మొదలై చెడుస్నేహాల ప్రభావంతో యువత మత్తు పదార్థాల వైపు వెళ్తున్నారన్నారు. కావున ఆయా నష్టాలపై సామాజిక, ప్రసార మాధ్యమాలు, పత్రికల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ ర్యాలీలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ డిపిఎం వెంకటరత్నం, సిబ్బంది మురళి, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది, రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ నరేష్, భాస్కర్, శంషాద్, షేక్షావలి, అనీలాకుమారి, అలివేలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



గుత్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, అధికారులు, వైద్యసిబ్బంది

అలాగే మాదకద్రవ్యాలను కలిగి ఉన్నా, రవాణా చేసినా ఉపయోగించినా నేర తీవ్రతను బట్టి సంవత్సరం నుంచి యావజ్జీవ కారాగారశిక్ష విధించే అవకాశం ఉందని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి గరికపాటి దీనబాబు తెలిపారు. సోమవారం ప్రపంచ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ విజయనగర న్యాయ కళాశాల న్యాయసేవా అధికార సంస్థ సంయుక్తంగా ప్రిన్సిపల్ డాక్టర్ రాఘవేంద్ర చార్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాల నుంచి పల్లెల వరకూ మాదకద్రవ్యాల వినియోగం విస్తృతంగా సాగుతోందన్నారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలనానరు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఎ.రామిరెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, పుట్టపర్తి సత్యసాయి విద్యాసంస్థల ఆచార్యులు దీపక్ ఆనంద్, మధ్యవర్తిత్వ కేంద్రం సభ్యుడు హరికృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం మహేష్, అధ్యాపకులు కోటేశ్వరరావు, శివశంకర్ రెడ్డి, జే. సోని, పీవీ నిర్మలా దేవి, ఆర్ కల్పన, నాగరాజు, ఐశ్వర్య భారతీ, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మాదకద్రవ్యాల జోలికి వెళ్లరాదని లేనిచో వారి జీవితాలు నాశనం అవుతాయని డాక్టర్ విష్ణుమూర్తి, ఎస్సై బి.రామకష్టారెడ్డి అన్నారు. కమ్యూనిటీ వైద్యశాల, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం గుత్తిలో నిర్వహించారు. కమ్యూనిటీ వైద్యశాల నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ప్రభావితం చేసే సంక్లిష్ట సమస్య అన్నారు. వాటిని ఉపయోగించే చాలామంది కళంకం తోపాటు వివక్షతను ఎదుర్కొంటున్నారని చెప్పారు. మాదక



అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ వీరబ్బాయి

ద్రవ్యాలు సేవిస్తే శారీరిక, మానసిక ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి రమణ, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ టిఐ ప్రాజెక్టు మేనేజర్ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం సిఐ బి.లక్ష్మన్న, సెబ్ ఎస్ఐ హరికృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం నుంచి వినాయక కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా పోలీస్, సెబ్ అధికారులు మాదక ద్రవ్యాలను వినియోగిస్తే కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు మాదక ద్రవ్యాలను వాడబోమని ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో వైద్య ఆరోగ్య సిబ్బంది, మాస్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు, రాయల్, కెటిఎస్ డిగ్రీ కళాశాలలు, వెంకటేశ్వర, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : మాదక ద్రవ్యాలను వినియోగిస్తే ఆ వ్యక్తి నాశనమవ్వడమే కాకుండా అతడిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడతాయని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో కళాశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా టి సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి మాదకద్రవ్యాలు తీసుకోవడం ద్వారా కలిగే అనర్థాలను విద్యార్థి దశలోనే తెలుసుకుంటే వాటి పట్ల ఆకర్షితులు కారన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన ఉండాలి : ఎంపిపి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కుష్టువ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. కుష్టువ్యాధి నివారణ వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యసిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కుష్టువ్యాధిపై సర్వే చేయాలన్నారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే ఆసుపత్రులకు సిఫారసు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ స్వాతిలక్ష్మీ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు మన్నేరు కొండమ్మ, సిహెచ్‌ఒ మోహన్‌రావు, పిహెచ్ ఎన్.చెన్నమ్మ, సూపర్‌వైజర్లు, బి.ఈశ్వరమ్మ, డి.ఈశ్వరమ్మ, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : కుష్టువ్యాధి నివారణపై సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, కుష్టువ్యాధి లక్షణాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దయాకర్, సబిహా సుల్తానా, ఎంపిహెచ్ఇఒ నాగేశ్వరయ్య, మునాఫ్, పిహెచ్ ఎన్ తులసమ్మ, సూపర్‌వైజరు రత్నమ్మ, ఒపి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : కుష్టువ్యాధిని మొదట్లోనే గుర్తిస్తే సులభంగా నివారించవచ్చని డిపిఎంఒ వెంకటేశ్వర్లు, వైద్యులు శ్రీనివాసబాబు, అమర్నాథ్ సూచించారు. కుష్టువ్యాధి నివారణపై ఇంటింటి సర్వేలో భాగంగా సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కుష్టువ్యాధి నివారణ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపిపి సునీత, వైద్యసిబ్బంది



పెద్దవడుగూరు, గార్లదిన్నెలో ర్యాలీలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


గార్లదిన్నె : కుష్టు వ్యాధి నియంత్రణలో భాగంగా మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి షమీంతాజ్ మాట్లాడుతూ జూలై 17 వరకూ కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు గౌతమి, హనేశా, సిహెచ్ఒ లోకనాథ్, సూపరవైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిస్సహాయ స్థితిలో ఉన్న తల్లీకూతుళ్లను ఆదుకోవాలి

డిజిహెచ్‌ఎస్ అధ్యక్షులు గోపాల్

ప్రజాశక్తి-ఉరవకొండ

నిస్సహాయ స్థితిలో ఉన్న మండల పరిధిలోని రాకెట్ల గ్రామానికి చెందిన ఎర్రమ్మ, కుమార్తె పూజను ఆదుకోవాలని దళిత గిరిజన హక్కుల సాధన సమితి అధ్యక్షులు గోపాల్ కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని కార్యాలయంలో తహశీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె కుటుంబానికి రేషన్‌కార్డు, ఓటర్ కార్డు, పెన్షన్ లాంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. తండ్రి మరణానంతరం వారు ఎక్కడికో వలస వెళ్లి జీవనం సాగించారన్నారు. ప్రస్తుతం ఆమెతో పాటు కూతురు పూజ తిరిగి సొంతగ్రామం చేరుకున్నారన్నారు. కావున అధికారులు స్పందించి బియ్యంకార్డు ,ఓటర్ కార్డుతోపాటు ఒంటరి మహిళ పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్పను కలిసి పూజ చదువుకునేందుకు అవకాశం కల్పించి పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిజిహెచ్‌ఎస్ఎస్ నాయకులు లత్తవరం చంద్రశేఖర్, ముష్టూరు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం సమర్పిస్తున్న డిజిహెచ్‌ఎస్ అధ్యక్షులు గోపాల్

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఆత్మకూరు

కనీస వేతనంతోపాటు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల విద్యాధికారి నరసింహారెడ్డికి సోమవారం మండలవ్యాప్తంగా పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా సహాయ జిల్లా కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులకు కేంద్రం నిధులు కేటాయించి ప్రతినెలా 5వ తేదీలోపు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించరాదన్నారు. అలాగే ప్రభుత్వమే గ్యాస్‌తోపాటు వంట పాత్రలు వెళ్లిన సరఫరా చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, హై స్కూల్‌లో పనిచేస్తున్న వారికి వేతనాలిచ్చి రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ధరలకు పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం జిల్లా సహాయ కార్యదర్శి జయమ్మ, కార్మికులు పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతిపత్రం సమర్పిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికసంఘం నాయకురాలు నాగమణి, తదితరులు

డాక్టర్ రఘునందన్ సేవలు మరువలేనివి

వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి

ప్రజాశక్తి-అనంతపురం

ఏడాదిన్నర కాలంగా ఆర్థోపెడిక్ ప్రధాన విభాగాధిపతిగా, అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రఘునందన్ సేవలు మరువలేనివని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి కొనియాడారు. పదోన్నతిపై వెళ్తున్న డాక్టర్ రఘునందన్‌ను సోమవారం స్థానిక మెడికల్ కళాశాల సెంట్రల్ హాలులో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతి గొప్ప జ్ఞానం, చక్కని చిరునవ్వు, ఓపిక, కష్టపడే తత్వం ఉన్న ఒక గొప్ప డాక్టర్,టీచర్, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రఘునందన్ అని కొనియాడారు. డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాల కంటే మెరుగైన సదుపాయాలు, వైద్య విద్య, పచ్చదనం, పరిశుభ్రత, ఇక్కడ నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఇక్కడ డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆఫీసు సిబ్బంది, ఇతర సాంకేతిక సిబ్బంది మంచి సహకారం అందించడం వల్లే చక్కగా పనిచేయగలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ కెఎల్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ షారోన్ సోనియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం అనంతపురం శాఖ అధ్యక్షులు డాక్టర్ రామస్వామినాయక్, కంటి శాస్త్ర ప్రధాన విభాగాధిపతి డాక్టర్ గీత, డాక్టర్ ఆత్మరామ్, డాక్టర్ శివశంకర్‌నాయక్, డాక్టర్ శంకర్, డాక్టర్ సరళ, డాక్టర్ భవాని, డాక్టర్ శంకర్ నారాయణ, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్, డాక్టర్ లక్ష్మి, మెడికోలు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు.



డాక్టర్ రఘునందన్‌ను సన్మానిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి, సిబ్బంది

ప్రజల గుండెల్లో వైఎస్ఆర్ కుటుంబం

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజల గుండెల్లో వైఎస్ కుటుంబం చెరగని ముద్ర వేసుకుందని ఎపి ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్ తెలిపారు. వైసిపి మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'హర్ దిల్ మే వైఎస్ఆర్ - హమ్ సబ్ జగన్ కే సాథ్' కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న బియాబని మసీదులో సమస్యపై ముస్లిములతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిములకు ఏ ఇతర సిఎం చేయనివిధంగా దివంగత సిఎం రాజశేఖర్‌రెడ్డి చేశారన్నారు. ఆయన చేసిన కృషి వల్లే నేడు ఎంతో మంది ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారని తెలిపారు. వైఎస్ఆర్ బాటలోనే ఆయన తనయుడు సిఎం జగన్ నడుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సైఫుల్లా బేగ్, రిజ్వాన్, మూహేబ్, పలువురు కార్పొరేటర్లు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ముస్లిం నాయకులు